క్లుప్తంగా

దెందులూరు ఏఎంసీ చైర్‌పర్సన్ గారపాటి రామసీత



దెందులూరు: దెందులూరు నియోజకవర్గం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా గారపాటి రామసీత నియమితులయ్యారు. గతంలో ఉన్న పాలక వర్గం రద్దు కావడంతో కూటమి ప్రభుత్వం నూతన చైర్మన్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం లిఖిత పూర్వకఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగానే దెందులూరు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా రామసీత నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

ఉంగుటూరు ఏఎంసీ చైర్‌పర్సన్ కారేటి జ్యోతి



ఉంగుటూరు: మండలంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా జనసేన పార్టీకి చెందిన కారేటి జ్యోతిని నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన జాబితాలో వెల్లడించారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ఉంగుటూరు గ్రామానికిచెందిన సూరత్తుల అయ్యప్ప పార్టీ పటిష్టకు నిరంతరం పనిచేశారు. స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు వన్నెంటి పనిచేశారు. పలువురు కూటమి నాయకులు జ్యోతిలను అభినందనలు తెలిపారు.

గ్రామ సచివాలయం తనిఖీ

గణపవరం: మండలంలోని మొయ్యేరు గ్రామ సచివాలయాన్ని శుక్రవా రం జిల్లా పరిష త్ చైర్మన్ గంటా పద్మశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసమయంలో ఆఫీసు పనివేళలు ప్రారంభం అయినా పలువురు సిబ్బంది సీట్లు ఖాళీగా దర్శనమివ్వడంతో వెంటనే ఎంపీడీవోకు ఫోన్ చేసి ఆఫీసుకు రాని సిబ్బందికి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు.

2, 3 తేదీల్లో స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు

పెదపాడు : మండలంలో స్వయం ఉపాధి సోపానం కింద బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం ఈనెల 2, 3 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో ఎండీ అమీలు జమా తెలిపారు. ఇటీవల ఆన్‌లైన్ ద్వారా మండలంలోని 23 గ్రామాలకు చెందిన 839మంది ఆన్‌లైన్‌లో స్వయం ఉపాధి సోపానంలో రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్నారు. వారికి కేటాయించిన తేదీల్లో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.

దళిత సేన సింహగర్జనను విజయవంతం చేయండి

దెందులూరు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పరిరక్షించాలనీ కోరుతూ దళిత సేన సింహ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రవిప్రకాష్ అన్నారు. శుక్రవారం జిల్లా ప్రచారంలో భాగంగా చల్లపల్లిలో ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 5న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ కార్యాలయం వద్ద దళిత సేన సింహ గర్జన నిర్వహించడం జరుగుతుందన్నారు. దళితులందరూ విధిగా సింహగర్జన కార్యక్రమంలో పాల్గొని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పరిరక్షించేందుకు తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని ఆయన కోరారు.

బందకట్టు డ్యాంను అభివృద్ధి చేయాలి

కొయ్యలగూడెం: ఏజెన్సీ మెట్ట ప్రాంతానికే ఒకప్పుడు జలసిరిగా ఉన్న బందకట్టు డ్యాం అధ్వానంగా మారిందని, అభివృద్ధి పనులు చేయాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పీడబ్ల్యూడీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొయ్యలగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బందకట్టు డ్యాం నుంచి వచ్చే నీరు పోలవరం, చింతలపూడి, గోపాలపురం నియోజకవర్గాల్లో సుమారు 150 సాగునీటి చెరువులకు నీరు అందేదని అయితే ఇప్పుడు ప్రాభవం కోల్పోయిందనీ ఎంపీటీసీలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అభివృద్ధి ప్రతిపాదనలను సిద్ధం చేయాల్సిందిగా ఏఈ భాస్కరరావును ఆదేశించారు. జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, వైస్ ఎంపీపీలు తుమ్మలపల్లి గంగరాజు, మట్టా వనజా లక్ష్మి, విప్ గంటా శ్రీనివాస్ వివిధ ప్రభుత్వ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ ఏర్పాటు


లింగపాలెం: మండలంలోని కొత్తపల్లి గ్రామం బీసీ కాలనీలో డ్రైయినేజీ కాలువ పూడుకుపోయి మురుగు నీరు ఆగిపోయింది. విషయం తెలుసుకున్న కొత్తపల్లి సర్పంచ్ గుర్రాల కృష్ణకుమారి సత్యనారాయణ వెంటనే స్పందించి పైప్‌లైన్ ఏర్పాటు చేసి డ్రైయినేజీ వ్యవస్థను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్రాల కృష్ణకుమారి, సత్యనారాయణ, సెక్రెటరీ పాపారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాస్టర్ల శాంతి ర్యాలీ

కొయ్యలగూడెం: పాస్టర్ పగడాల ప్రవీణ్ ఆత్మశాంతి కోసం శుక్రవారం రాత్రి కొయ్యలగూడెంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. టీఎస్ స్నేహన్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మరణం హత్య అని పోస్ట్‌మార్టం రిపోర్ట్ తేలిన వెంటనే దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. పాస్టర్ విక్టర్ మాట్లాడుతూ పాస్టర్ల మీద దౌర్జన్యాలపై ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

నిరుద్యోగ భృతి.. భ్రాంతియేనా..!

- ఎన్నికల ముందు నిరుద్యోగ భృతిపై విస్తృత ప్రచారం
- అధికారం చేపట్టి పదినెలలు అవుతున్నా ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- పథకం అమలుపై రాని విధివిధానాలు
- నియోజకవర్గంలో 18 వేలమందికి పైగా నిరుద్యోగులు



ఎన్నికల హామీలు సూపర్ సిక్స్

దెందులూరు: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు నిరుద్యోగభృతిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. అధికారం చేపట్టిన వెంటనే ఈ పథకం అమలు చేస్తామని, అర్హత కలిగిన ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3వేలు వస్తామని ఇంటింటికీ వెళ్లి ఓట్లు దండుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా నిరుద్యోగ భృతి ఊసే లేదు. బడ్జెట్‌లో కూడా ఈ పథకానికి తగిన నిధులు కేటాయించకపోవడంతో నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి అమలు చేయాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

నెరవేర్చని తొలి సంతకం...

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజున మొదటి సంతకం చేసిన డీఎస్సీకే ఇప్పటివరకూ దిక్కులేదని నిరుద్యోగులు అంటున్నారు. నియోజకవర్గంలో 2వేలకు పైగా బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. తొలి సంతకాన్ని నమ్మి వివిధ కోచింగ్ సెంటర్లలో చేరి శిక్షణ పొందుతున్నారు. ప్రభుత్వం టెట్‌తోనే సరిపెట్టి ఇప్పటి వరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా వాయిదాలు వేస్తోంది. ఇతర ఉద్యోగాలు భర్తీకి కూడా కూటమి సర్కారు స్పష్టమైన ప్రకటన చేయలేదు. గ్రూపు–2 పరీక్షలు నిర్వహించినా ఫలితాలు ఎప్పుడు ప్రకటిస్తారో...ఉద్యోగాలు ఎప్పుడు ఇస్తారో దేవుడికే ఎరుక. ఎన్నికల హామీ మేరకు ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలని నియోజకవర్గంలోని 18వేల మందికి పైగా నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి నాయకులు ప్రచారం చేశారు. కనీసం ఈ పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారో ఇప్పటికీ ప్రకటించలేదు. ఓట్లు దండుకోవడానికే హామీలు ఇచ్చారు. నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. 2014లో చేసినట్లే మళ్లీ మోసం చేస్తామనుకుంటే నిరుద్యోగులు ఈ ప్రభుత్వంపై తిరగబడే అవకాశం ఉంది.

– కట్టా ఏసుబాబు, నిరుద్యోగి దెందులూరు

ఉద్యోగాలను భర్తీ చేయాలి



ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగులు ఇస్తామని, ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగులు భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రకటించారు. ఇప్పటికీ ఒక్క ఉద్యోగం కూడా నిరుద్యోగులకు కల్పించలేదు. డీఎస్సీ అన్నారు అదీలేదు. మరోవైపు వివిధ శాఖల్లో ఖాళీలు అధికంగా ఉన్నాయి. భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడంలేదు. ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగ భృతి అన్నారు. అదీలేదు. నిరుద్యోగులకు తీరని మోసం జరుగుతుంది.

– బోరా మురళి, నిరుద్యోగి దెందులూరు

కొల్లేరు బాధితుల సమస్యలు పరిష్కరించాలి


ప్రజాచైతన్య యాత్రలో పాల్గొన్న నాయకులు

దెందులూరు: కొల్లేరు ఆపరేషన్ పేరుతో ప్రభుత్వం చేపట్టిన చర్యలు వల్ల కొల్లేరు పేదలు జీవనోపాధికి ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు వలసలు పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కొల్లేరు ప్రజా సమస్యలపై సీపీఎం ప్రజా చైతన్యయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కొల్లేరు సరస్సును 5 నుంచి 3వ కాంటూరుకు కుదించాలన్నారు. కాలుష్యం అరికట్టాలన్నారు. నష్టపోయిన పేదలు, సొసైటీలు, డి. ఫారం పట్టాదారులకు కుటుంబానికి రెండెకరాల భూమి ఇవ్వాలన్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలన్నారు. నష్టపోయిన జిరాయితీ సన్న, చిన్నకారు రైతులకు భూమికి విలువైన ప్రత్యామ్నాయ భూమి ఇవ్వాలని, బెడ్ (లోతట్టు) గ్రామాల్లో రోడ్లు, వంతెనలు, చెరువులు, ఇతర ప్రజావసర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. రైతాంగం నష్ట పోకుండా చూడాలన్నారు.రెగ్యులేటర్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కొల్లేరు పరిధి పెంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేసే చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్. లింగరాజు, కె. శ్రీనివాస్, పి.రామకృష్ణ, సీపీఎం నాయకులు ఎస్. సత్యనారాయణ, కొల్లేరుగ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సింహ వాహనంపై నూకాలమ్మ గ్రామోత్సవం


నూకాలమ్మకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ వార్షిక ఉగాది జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు), ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నాలుగో రోజు శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ముందుగా నిత్యపూజలు, మూలవిరాట్‌కు పంచామృత, పుణ్య నదీ జలాలతో, విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త కేఎల్ఎస్ ధనకుమార్ శక్తితత్త్వంపై ప్రవచనం చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు తాండ్రపాపారాయుడు సెంటర్ రామాలయం నుంచి ప్రత్యేక సింహవాహన రథంపై నూకాలమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు), వెంకట రామలక్ష్మి దంపతులు, ఆలయ కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. శ్రీభక్తాంజనేయ స్వీట్స్ అధినేత గుబ్బల రాంబాబు, లక్ష్మి దంపతులు 25 కేజీల పంచదార బూందీ, కిలపర్తి సుబ్బారావు, నాగ రమాదేవి దంపతులు 25 కేజీల లడ్డు అమ్మవారికి సమర్పించారు. వారికి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. నూకాంబికా మహిళా సేవా భక్త బృందం, యువత, ఆలయ కమిటీ విశేషంగా చేసిన కృషితో గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు.

వైభవంగా నూకాలమ్మ జాతర


ఊరేగింపులో శక్తి వేషధారులు


నూకాలమ్మవారు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట 43వ డివిజన్‌లో నూకాలమ్మ కొత్త అమావాస్య జాతర మహోత్సవం దేవాదాయ శాఖ, ఉత్సవ కమిటీ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభోగంగా నిర్వహించారు. తొలుత ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆలయంలో పూజలు చేసి, జాతరను ప్రారంభించారు. నూకాలమ్మ కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అర్చకుడు మంత్రవాది రామకృష్ణ యోగానంద శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బేత, భూతాల వేషధారణలు, కోలాట నృత్యం, గోవిందా గోవిందా నృత్య ప్రదర్శన, కాళికాదేవి, లక్ష్మీనరసింహ, శక్తి వేషధారణలతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో త్రిపర్ణ రాజేష్, ఉత్సవ కమిటీ చైర్మన్ దావాలా రంగ సత్యనారాయణ, జంపా సూర్యనారాయణ, ఆలయ వ్యవస్థాపకులు కొఠారి అప్పల కొండల రావు, నీరుకొండ అప్పారావు, వలపుల నూకరాజు, ఉల్లింగల సురేష్, కరణం రాజు, కోలా సురేష్, నక్క నాగేశ్వరావు, గొంతిన రామకృష్ణ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఉపాధి కాపాడండి


యాత్ర కరపత్రం విడుదల చేసిన జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి

ఏలూరు (టూటౌన్): ఆటో డ్రైవర్లకు సంక్షేమ చట్టం చేయాలని ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాపిడో, ఉబర్, ఓలా వంటి విదేశీ కార్పొరేట్ సంస్థల వల్ల ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో స్థానిక పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన ప్రచార యాత్ర సభలో ఆయన మాట్లాడారు. ఎటువంటి పెట్టుబడి లేకుండా ఒక కాల్ సెంటర్ ఏర్పాటు చేసుకుని, రూ.కోట్లలో మన దేశ ఆదాయాలను కొల్లగొడుతున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వదేశీ నినాదాన్ని ప్రచారం చేస్తూ, విదేశీ బహుళ జాతి కంపెనీలకు అనుమతులు ఇవ్వడం సరికాదని అన్నారు. ఆరు శాతానికి మించి కమీషన్లు వసూలు చేయకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ 25 నుంచి 30 శాతం కమీషన్ వసూలు చేస్తున్న రేపిడో, ఉబర్, ఓలా సంస్థలపై కర్ణాటక తరహాలో చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు నగరంలో అనేక దశాబ్దాలుగా ప్రజలకు సురక్షిత ప్రయాణ సేవలను అందిస్తూ, ఆటో డ్రైవర్లు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. అసలే కిరాయిలు లేక అవస్థలు పడుతున్న సమయంలో రాపిడో వంటి సంస్థల వాహనాలు స్థానిక ఆటో కార్మికుల కిరాయిలను తరలించకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డాల రాజు (నాని), స్థానిక ఆటో యూనియన్ల నాయకులు కె.నారాయణ, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఖురాన్, ఖర్జూరం పంపిణీ


ముస్లింలకు ఖురాన్, ఖర్జూరం ప్యాకెట్లు అందిస్తున్న జేపీ, బాజీ

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ ఏలూరు కార్యాలయంలో రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ షేక్ సయ్యద్ బాజీ (గాజుల బాజీ) ఆధ్వర్యంలో రంజాన్ దీక్షలను పురస్కరించుకుని ముస్లింలకు ఖురాన్, ఖర్జూరం ప్యాకె ట్లు పంపిణీ చేశారు. వీటిని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ చేతులమీదుగా పంపిణీ చేయించారు. తొలుత రంజాన్ ఉపవాస దీక్షల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రాబోయే రంజాన్ పర్వదినాన్ని ముస్లింలంతా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, అల్లాహ్ దయతో అందరూ సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుడిదేశి శ్రీనివాసరావు, నెరుసు చిరంజీవి, నూకపెయ్యి సుధీర్‌బాబు, దుర్గారావు, గంటా మోహనరావు, తదితరులు హాజరయ్యారు.

విద్యార్థినులకు ఉద్యోగాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాల కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్లోబల్ వన్ సర్వీసెస్ సంస్థ (హైదరాబాద్) సహకారంతో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. గ్లోబల్ వన్ సర్వీసెస్ సీఈఓ సునీల్ కుమార్, ఇన్ఫోలుమి సంస్థ హెచ్ఆర్ కిషక్షర్ కుమార్ పాల్గొన్నారు. డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న 161 మంది పాల్గొనగా, వీరిలో 80 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథ రావు, ప్రిన్సిపాల్ జి.సరళ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.ఝాన్సీలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పెదపాడు: పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద రూ. 5900లు స్వాధీనం చేసుకున్నట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఖాజీగూడెం గ్రామంలో చేపల చెరువుపై పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తుల నుంచి రూ.5,900లు నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు.

రుణాలతో ఆర్థిక స్వావలంబన


గణపవరం: ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

గణపవరం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని, ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో వివిధ పథకాలకు కొరకు లబ్ధిదారుల ఎంపిక కార్యాక్రమం శుక్రవారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎ.గోపవరం, అర్ధవరం, చిలకంపాడు, గణపవరం, జల్లికొమ్మర, కొత్తపల్లి, ముగ్గుళ్ల, పిప్పర, సరిపల్లె, వాకపల్లి, వల్లూరు, వరదరాజ పురం, వీరేశ్వరపురం, వెలగపల్లి, వెంకట్రాజపురం గ్రామాలకు చెందిన 732 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ముఖాముఖీలు సాయంత్రం 5 గంటల వరకూ కొనసాగాయి. ఈ కార్యక్రమంలో గణపవరం ఎస్‌బిఐ, పిప్పర ఎస్‌బిఐ, కెనరాబ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

అరకొర రుణాలకు ఆసక్తి చూపని దరఖాస్తుదారులు


భీమడోలు: నిరుద్యోగులను ఇంటర్వ్యూలు చేస్తున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి

భీమడోలు: స్వయం ఉపాధి సోపానం పథకం కింద కాపు, బీసీ, ఈబీసీ రుణ గ్రహీతలకు శుక్రవారం ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. భీమడోలు సమావేశ మందిరంలో బ్యాంకర్లతో కలిసి ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి భీమడోలు, అంబర్‌పేట గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. భీమడోలు, అంబర్‌పేట గ్రామాలకు చెందిన 60 ఏళ్ల లోపు మహిళలు, నిరుద్యోగులు తదితరులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. దరఖాస్తుదారుల నుంచి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను సిబ్బంది స్వీకరించారు. యూనిట్ల స్థాపనపై దరఖాస్తుదారుల నుంచి బ్యాంకర్లు వివరాలు అడిగి తెలుసుకున్నారు. 821 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 488 మంది హాజరయ్యారు. మండల వ్యాప్తంగా 124 యూనిట్లకు గాను 1607 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే రుణాలు అరకొరగా ఉన్నందున దరఖాస్తుదారులు ఇంటర్వ్యూలకు ఆసక్తిని చూపలేదు. ఆశతో దరఖాస్తులు భారీగా నమోదు చేసుకున్నారు. పోటీ తీవ్రంగా ఉండడంతో లబ్దిదారుల ఎంపికపై అధికారులు తలల పట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఏ.సుందరి, గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి ఇంటర్వ్యూలకు 421 మంది హాజరు


నిడమర్రు: అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయకుమారి

నిడమర్రు: స్వయం ఉపాధి సోపానం పథకం 2024–25 లబ్ధిదారుల ఎంపిక కోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 421 మంది హాజరైనట్లు ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. మొత్తం 597 మంది దరఖాస్తులు చేసుకోగా 176 మంది హాజరు కాలేదన్నారు. కాపు కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్‌తో పాటు స్వయం ఉపాధి రుణాలు మొత్తం 100 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. కాపు 51, బీసీ 38, ఇతర కార్పొరేషన్లకు 11 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. వచ్చే నెల 3వ తేదీన మిగిలిన గ్రామాలైన క్రొవ్విడి, చానమిల్లి, సిద్ధాపురం, నిడమర్రుచ మందలపర్రు, గుణపర్రు గ్రామాలకు చెందిన దరఖాస్తు దారులకు ఈ స్వయం ఉపాధి రుణాల ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

554 మంది ఇంటర్వ్యూలకు హాజరు

ఉంగుటూరు:మండలంలో రెండురోజులు పాటు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలకు 804 మందికి గాను 559 మంది హాజరయ్యారు. ఎంపీడీవో రాజ్‌మనోజు ఈ ఇంటర్వ్యూలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంబంధిత బ్యాంకు అధికార్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మోగిన జలగంట

- రోజుకు మూడు సార్లు వాటర్ బెల్
- వేసవి నేపథ్యంలో చిన్నారులకు ఎప్పటికప్పుడు తాగునీరు


గుండుగొలను నెం.1 పాఠశాలలో వాటర్ గంటలో నీరు తాగుతున్న చిన్నారులు

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లో జలగంట మోగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మార్చి నెలలో ఎండలు తీవ్రత మే నెలను తలపిస్తున్నాయి. దీనితో విద్యార్థులు వడదెబ్బతో పాటు ఆనారోగ్య సమస్యలు దరి చేయకుండా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురి కాకుండా పాఠశాలలో రోజుకు 3 సార్లు వాటర్ బెల్ విధానం అమలు చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఒంటి పూట బడుల సమయంలో ఉదయం 10, 11, 12 గంటలకు జల గంట కొట్టాలని సూచించింది. పాఠశాలల్లో చిన్నారులకు తాగునీరు అందుబాటులో ఉండేలా తగు చర్యలు చేపట్టాలని హెచ్ఎంలను సూచించింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ విధానం అమలు చేసింది. దీనిని కూటమి సర్కార్ కొనసాగిస్తుంది. ఎండల తీవ్రత రీత్యా విద్యార్థులకు మంచినీరు అవసరమని వైద్య ఆరోగ్య శాఖ సూచనల మేరకు సంబంధిత విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వ విద్యాలయాల్లో జలగంట మోగించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. పాఠశాలకు వచ్చే చిన్నారులు అల్పాహారం తినక... నీరు తాగకుండా పాఠశాలకు వెళ్తుంటారు. ఈ సమయంలో ఎండవేడిని తట్టుకోలేక సొమ్మసిల్లి పడి పోతున్న సంఘటనలు దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో పక్కాగా వాటర్ బెల్ కార్యక్రమాన్ని అమలు చేయాలని నిపుణులు, వైద్యులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

ప్రతి రోజు మూడు సార్లు

సాధారణ రోజుల్లో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు సార్లు విరామ సమయంలో జల గంట కొడతారు. ఈ తరుణంలో చిన్నారులు మంచినీరు తాగుతారు. అదే విధంగా మనం తీసుకునే ఆహారం ద్వారా 20శాతం వరకు నీరు శరీరంలోకి చేరుతుంది. ఆహారం జీర్ణం అయ్యేందుకు మరో 10శాతం ఉత్పత్తి అవుతుంది. మిగిలిన 70శాతం ద్రవాల రూపంలో శరీరానికి మనమే అందించాలి. అందుకే పిల్లలకు నీటిని ఎక్కువగా తీసుకునే వెసులుబాటును కల్పిస్తూ జల గంట కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ఏడాది భానుడి ప్రతాపంతో ప్రజలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒంటి పూట బడులు విధానం అమలవుతున్నా మధ్యాహ్నం 12.30 గంటలకు పాఠశాలలను విడిచిపెడుతున్నారు. దూర ప్రాంతాల్లోని విద్యార్థులు ఎండలోనే తమ గృహాలకు వెళ్తున్నారు. దీనితో వారంతా ఆనారోగ్యం బారిన పడుతున్నారు.

మూడు సార్లు జల గంట కొడతారు సరే

ప్రభుత్వ పాఠశాలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హాయంలో నాడు నేడు కార్యక్రమంలో ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. దీంతో చిన్నారులు స్వచ్ఛమైన నీరు తాగేలా సంబంధిత ప్రధానోపాధ్యాయులు తగు చర్యలు చేపట్టారు. కొన్ని పాఠశాలల్లో ఆ సదుపాయం లేకపోవడంతో చిన్నారులే తమ వెంట వాటర్ బ్యాటిల్స్ తెచ్చుకుంటున్నారు. రోజుకు మూడు సార్లు బెల్ కొట్టిన స్వచ్ఛమైన నీరు అందని పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న ఉన్నత పాఠశాలల్లో మూడు సార్లు జల గంట కొడితే సమయమంతా సరిపోతుందని హెచ్ఎంలు ఆ విధానాన్ని అమలు చేయడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా ప్రైవేటు పాఠశాలల్లో ఈ విధానం అమలే కావడం లేదు. వేసవిలో విధిగా ఈ విధానం అమలయ్యేలా విద్యాశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రోజు వారీ పిల్లలు తీసుకోవాల్సిన నీటి వివరాలు

వయస్సు	నీరు(లీటర్లలో)
4–8	1.2
9–13	1.7
14–18	1.9